క్లుప్తంగా

కార్యాచరణ ప్రణాళికపై శిక్షణ

చాపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో బుధవారం 2025–26 వార్షిక కార్యాచరణ ప్రణాళికపై ఒక రోజు శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీఓ వీరకిశోర్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ జరిగే ఈ శిక్షణకు జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచులు, అధికారులు హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

చెత్తను కాల్వల్లో వేయకండి

ప్రొద్దుటూరు: మురికి కాలువల్లో చెత్త వేయకండి.. పారిశుద్ధ్య కార్మికులకు చెత్త ఇవ్వండి అంటూ మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున సూచించారు. పట్టణంలోని మురుగు కాల్వలను మున్సిపల్ కమిషనర్ నాగేంద్ర మంగళవారం పరిశీలించారు. రామేశ్వరం మోరీల వద్ద ఉన్న చెత్త తొలగించాలని శానిటేషన్ సిబ్బందికి సూచించారు. గాంధీ రోడ్డులోని మదురు ఛానల్‌లో పేరుకుపోయిన చెత్త తొలగించాలని ఆదేశించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

ఓరియంటేషన్ శిక్షణ నేడు

ప్రొద్దుటూరు: మండలంలోని జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీ సర్పంచులు, మండలస్థాయి అధికారులకు ఈ నెల 13న ఓరియంటేషన్ శిక్షణ ఉంటుందని ఎంపీడీవో ఎస్.సూర్యనారాయణరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగే శిక్షణకు అందరూ తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

ఖోఖో, కబడ్డీ పోటీలు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక వైవీఎస్ మునిసిపల్ గర్ల్స్ హైస్కూల్‌లో మంగళవారం ఖోఖో, కబడ్డీ, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు ఈ నెల 14న బాలల దినోత్సవం సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేస్తామని ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు భారతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నాగార్జున, వ్యాయామోపాధ్యాయురాలు లక్ష్మీదేవి, ఇన్నర్ వీల్ క్లబ్ సెక్రటరీ ప్రీతి, ఉష, అనురాధ, మణిశయన, లక్ష్మీ, కళ్యాణి, లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

నిధుల కేటాయింపు ఏదీ?

ఖాజీపేట: రాజోలు జలాశయం, ఉక్కు పరిశ్రమకు నిధులు కేటాయించకపోవడంతో జిల్లా ప్రజలు నిరాశకు గురయ్యారని ఏపీఎస్ఆర్టీసీ కడప రీజనల్ మాజీ అధ్యక్షుడు రెడ్యం వెంకట సుబ్బారెడ్డి అన్నారు. దుంపలగట్టు గ్రామంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌పై ఆశలు పెట్టుకున్న రైతులు, నిరుద్యోగులు నష్టపోయారని అన్నారు. అన్నదాత సుఖీభవ పేరుతో రైతుల ఖాతాకు నేటికీ రూ 20 వేలు జమ చేయలేదన్నారు. వాలంటీర్లకు రూ.10 వేలకు వేతనం పెంచుతామని చెప్పి, బడ్జెట్‌లో రూ.82.51 కోట్లు కేటాయించారన్నారు.

విద్యార్థులకు పోటీలు

కలసపాడు: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక సెయింట్ ఆంటోనీస్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు చిత్తాప్రభావతి మాట్లాడుతూ విజేతలకు బాలల దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తామని తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ చిత్తారాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెలుగు గంగ.. చెరువులకు చేరంగ

- మండలంలోని ఐదు చెరువులకు జలకళ



ఖాజీపేట: భూగర్భజలాలు అడుగంటి రైతు దిగాలుపడుతున్న సమయంలో తెలుగు గంగ స్థానిక చెరువులకు చేరింది. నీటితో నింపడంతో ప్రస్తుతం జలకళ సంతరించుకుంది. భూగర్భ జలమట్టం పెరగడం, వ్యవసాయ బోర్లలో నీరు చేరడంతో రైతులు పంటల సాగువైపు మొగ్గు చూపుతున్నారు.

ఖాజీ పేట మండలంలో ఏడు ప్రధాన చెరువులు ఉన్నాయి. చెమ్ముళ్లపల్లె, దుంపలగట్టు, రావులపల్లె, ఆంజనేయకొట్టాల, నందిపాడు చెరువులకు ప్రధాన ఆధారం కేసీ కాల్వ నీరు. వర్షాలు కురిసినా ఈ చెరువులకు నీరు చేరడం కష్టమే. ఇవి ఎండిపోయినపుడు సమీప బోర్లలోనూ భూగర్భ జలాలు తగ్గిపోతాయి. ఆలస్యంగా కురిసిన వర్షాలకు ఇటీవల వరద నీరు చేరడంతో కేసీ కాల్వలకు నీటిని విడుదల చేశారు. మొదట ఐదు చెరువులకు నీటిని నింపడంతో ప్రస్తుతం జలకళ సంతరించుకుంది. వీటికి తోడు భారీ వర్షాలు కురిస్తే కొండలపై నుంచి వచ్చే నీటితో నిండే కన్నెలవాగు చెరువు, నాగసానిపల్లె చెరువులకు కొన్నేళ్ల తర్వాత నీరు చేరింది. తెలుగుగంగ కాల్వ నీటిని మళ్లించడంతో ప్రస్తుతం ఆ రెండు చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి.

పెరిగిన భూగర్భ జలాలు

మండలంలోని చెరువుల కింద దాదాపు 2400 ఎకరాల ఆయకట్టు ఉంది. గతంలో వర్షాలు సకాలంలో కురవక చెరువులకు నీరు చేరక. దీంతో ఖాజీపేట మండలంలో భూగర్భ జలమట్టం అడుగంటిపోయింది. బోర్లలో నీరు లేక రైతులు పొలాలవైపు చూడలేని పరిస్థితి. అయితే కేసీ, తెలుగు గంగ కాల్వ నీటిని మళ్లించడంతో రైతులు వరి సాగువైపు మొగ్గు చూపారు. దీనికి తోడు ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులకు నీరు చేరడం, అలాగే కుందూ, పెన్నా నదుల్లో నీటి ప్రవాహంఉండడంతో భూగర్భజలాలు పెరిగాయి. దీంతో స్థానికులకు తాగు, సాగు నీటి సమస్య తీరింది. దీంతో ఇప్పటికే రైతులు వరిసాగుతోపాటు పత్తి, పూలు, అరటి, చీని, తోటలు సాగు చేస్తున్నారు.

మండలంలో చెరువు విస్తీర్ణం వివరాలివీ

చెరువు	విస్తీర్ణం (ఎకరాల్లో)	ఆయకట్టు (ఎకరాల్లో)
కన్నెలవాగు	61.88	830
నాగసానిపల్లె	44.48	226
ఆంజనేయకొట్టాల	91.51	340.45
రావులపల్లె	95.90	183.55
దుంపలగట్టు	36	159.98
చెమ్ముళ్లపల్లె	100.83	361.21
నందిపాడు	83.23	310

చెరువులను నింపితే మేలు



మండలంలో చెరువులకు నీటిని నింపితే రైతులకు మేలు జరుగుతుంది. దుంపలగట్టు చెరువుకు సగం మేరకే నీరు చేరింది. కాల్వ నీటిని మళ్లించి పూర్తి స్థాయిలో నిండేలా నింపాలి. నీరు చేరితే తాగు, సాగునీటి కష్టాలు తీరుతాయి. పూల తోటలు వేసుకున్న రైతులకు ఎంతో ఉపయోగం.

– వెంకటరామిరెడ్డి, రైతు, దుంపలగట్టు

అధికంగా వరి పంటల సాగు



వరద నీరు జలాశయాలకు చేరడం.. కేసీ కాల్వకు నీరు వదలడంతో చెరువులను నీటితో నింపారు. కాల్వకు నీరు విడుదలైతే అధికంగా వరి పంట సాగు చేస్తారు. గతంలో కంటే ప్రస్తుతం భూగర్భ జలాలు పెరిగి బోరు బావులకు నీరు సంవృద్ధిగా లభిస్తోంది.

– నాగసుబ్బారెడ్డి, రైతు, భూమాయపల్లె

బాలల చట్టాలపై అవగాహన

కలసపాడు: కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఎగువ రామాపురం జెడ్పీ పాఠశాల విద్యార్థులకు బాలల చట్టాలపై మంగళవారం అవగాహన కల్పించారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం ప్రొటెక్షన్ అధికారి క్రిష్ణ ప్రతిరూప్ బాలల న్యాయచట్టం, చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1098, బాలలపై హింస, ఆకృత్యాల నుంచి రక్షణపొందడంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కమల, ప్రశాంతి, స్వర్ణలత, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన పెంచుకోవాలి

ప్రొద్దుటూరు: సమాజంపై ప్రతి మహిళ పూర్తి అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి, ఏపీఎం వెంకట సుబ్బమ్మ తెలిపారు. స్థానిక హౌసింగ్ బోర్డులోని ప్రాజెక్టు కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. వారు మాట్లాడుతూ ప్రత్యేకించి మహిళలను మరింత శక్తివంతం చేసేందుకు ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఎంఈఓ–2 శోభారాణి, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

బి.కోడూరు: ప్రతి ఇంటిలో అందరూ అక్షరాస్యులయినప్పుడే ఆ కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని ఎంపీడీఓ భాస్కర్‌రావు తెలిపారు. ఎంపీడీఓ సభా భవనంలో ఉల్లాస్ కార్యక్రమం నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి సునీల్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజన, వెలుగు ఏపీఎం సీతారామిరెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్షరాలు రాని ప్రతి ఒక్కరినీ అక్షరాస్యులుగా మార్చేందుకు సిబ్బంది కృషి చేయాలని తెలిపారు.

రైతుకు రూ.20 వేల సాయం చేయాలని వినతి



తహసీల్దారు రమాకుమారికి వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘాల నాయకులు, రైతులు

చాపాడు: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రైతులు, కౌలు రైతులకు ప్రభుత్వం తక్షణ సాయంగా ఒక్కొక్కరికీ రూ.20వేలు అందించాలని ఏపీ రైతు సంఘం(ఏపీకేఎస్)జిల్లా ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్, సీపీఐ జిల్లా సమితి సభ్యులు పల్లవోలు రమణ అన్నారు. తహసీల్దారు రమాకుమారిని మంగళవారం కలిసి రైతుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014–19లో సీఎం చంద్రబాబు రుణమాఫీ చేయగా, 4, 5వ విడత రుణమాఫీ సొమ్ము అందలేదని, ఆ మొత్తం ఇపుడు రైతులకు అందజేయాలన్నారు. రైతులు రబీలో సాగు చేస్తున్న పంటలన్నింటికీ ప్రభుత్వమే బీమా రుసుము చెల్లించాలని కోరారు. కేసీ కెనాల్ ఆయకట్టు పరిరక్షణకు రాజోలి రిజర్వాయర్ పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. మైదుకూరు కేంద్రంగా కేపీ ఉల్లి శాశ్వత కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి, 75 కిలోల వరి బస్తా ధాన్యాన్ని రూ.3 వేలకు తక్కువగా కాకుండా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, రామచంద్రుడు, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీలను వెంటనే నెరవేర్చాలి



ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

బద్వేలు అర్బన్: కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చాలని సీపీఎం పట్టణ కార్యదర్శి కె.శ్రీను డిమాండ్ చేశారు. హామీలను అమలు చేయాలని కోరుతూ మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో విద్యుత్తు ఛార్జీలు పెంచబోమని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం సామాన్య, పేద, మధ్యతరగతి ప్రజలపై రూ.18 వేల కోట్ల భారం మోపిందన్నారు. 28 మండలాలను కరవు మండలాలుగా ప్రకటించకపోవడం అన్యాయమన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 14న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ప్రజా పోరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అంతకు ముందు తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి తహసీల్దారు ఉదయభాస్కర్‌రాజుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో చిన్ని, బాబు, ఆదిల్, రాజగోపాల్, వెంకటపతి, ఖైరున్‌బీ, ఫాతిమా, మస్తాన్‌బీ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు లేని నిరుపేదలకు స్థలం కేటాయించాలి

ఇళ్లులేని నిరుపేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల స్థలం కేటాయిస్తామని అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరశేఖర్ పేర్కొన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయం జేవీ భవన్‌లో ఏరియా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హామీల అమలు కోసం ఈ నెల 18న సచివాలయాల వద్ద ఆందోళన నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఎడుగుమస్తాన్, బాలు, వెంకటరమణ, ఇమ్మానుయేల్, పెంచలయ్య, విజయమ్మపాల్గొన్నారు.

నూతన కమిటీ నియామకం

ప్రొద్దుటూరు కల్చరల్: బీసీల సంక్షేమానికి కృషి చేస్తానని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అదనపు సెక్రటరీ జనరల్ వెంకట కృష్ణయ్య యాదవ్ అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ శ్రీశైలంలో జరిగిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం సమావేశంలో తనను సంఘం అదనపు సెక్రటరీ జనరల్‌గా నియమించారన్నారు.

ఎమ్మెల్సీ నివాళి

కలసపాడు: మండలంలోని చెన్నారెడ్డిపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కొండారామచంద్రారెడ్డి సోమవారం రాత్రి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డీసీ.గోవిందరెడ్డి మంగళవారం రామచంద్రారెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ అంకనగురివిరెడ్డి, బి.కోడూరు వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శేషారెడ్డి పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ

ప్రొద్దుటూరు కల్చరల్ : సీవీ రామన్ సైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పదో తరగతి సీ, డీ గ్రేడ్ విద్యార్థుల కోసం రూపొందించిన భౌతిక, రసాయన, జీవశాస్త్ర స్టడీ మెటీరియల్‌ను డీఈఓ మీనాక్షి స్థానిక ఉప విద్యాశాఖాధికారి కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులకు మెటీరియల్ ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ జిల్లా కన్వీనర్ కేవీ.విజయమోహన్‌రెడ్డి, ప్రెసిడెంట్ వంశీ, సెక్రటరీ అల్లాబకాష్, గౌరవాధ్యక్షుడు గోపీనాథరెడ్డి, రవిప్రకాష్, స్టడీ మెటీరియల్ రూపకర్త చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నాడు–నేడు పనులను పూర్తి చేయాలి

నాడు– నేడు పనులు వెంటనే పూర్తి చేయాలని డీఈఓ మీనాక్షికి విద్యార్థి, ప్రజా సంఘాల ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. విద్యను వ్యాపారంగా మారుస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఓబులేసు, నరసింహులు, ప్రతాప్‌రెడ్డి, బయన్న, చెన్నమ్మ, బెనర్జి, పాల్గొన్నారు.

10వ జిల్లా మహాసభలు జయప్రదం చేయండి



మహాసభల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆర్ఎస్‌యూ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : వైఎస్సార్ జిల్లా బద్వేల్ పట్టణంలో ఈ నెల15, 16 తేదీలలో జరగనున్న ఆర్ఎస్‌యూ 10వ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని ఆర్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ పేర్కొన్నారు. మంగళవారం కడప నగరంలోని విశ్వ ప్రగతి చిట్‌ఫండ్ కార్యాలయంలో జనసేన జిల్లా నాయకులు తుంగ రమణయ్యతో కలిసి గోడపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవల్యూషనరీ స్టూడెంట్ యూనియన్ చదువు, పోరాడు, సాధించు అనే నినాదంతో ఏర్పడిందన్నారు. మహాసభల సందర్భంగా గత విద్యా సంవత్సరం కాలంగా నిర్వహించిన పోరాటాలు సమీక్షించుకొని భవిష్యత్తు కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ జిల్లా నాయకులు కళ్యాణ్, వంశీ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న రూరల్ ఎస్ఐ మహమ్మద్ రఫీ

ప్రొద్దుటూరు: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని రూరల్ ఎస్ఐ మహమ్మద్ రఫీ తెలిపారు. సేఫ్ ఇండియా – స్మార్ట్ లింగ్ ప్రోగ్రాంలో భాగంగా కొత్తపల్లె పంచాయతీ రింగ్ రోడ్డులోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. వాల్మీకి సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి ట్రాఫిక్ నిబంధనలపై నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనాలను నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలన్నారు. నిబంధనలను పాటించకపోవడంతో రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ మంది మృత్యువాత పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీచైతన్య విద్యా సంస్థల ప్రొద్దుటూరు జోన్ ఏజీఎం నాగిరెడ్డి, ప్రిన్సిపల్ తమాలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళల్లో వంద శాతం అక్షరాస్యతే లక్ష్యం

ఖాజీపేట: మహిళలలకు వంద శాతం అక్షరాస్యత నేర్పించడమే లక్ష్యమని, అబల చదివితే కుటుంబం బలోపేతం అవుతుందని ఎంపీడీఓ దివిజా సంపతి సూచించారు. వెలుగు కార్యాలయంలో జరిగిన ఉల్లాస్ శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఖాజీపేట మండలంలో 15 సంత్సరాలబకు పైబడి.. చదువు లేని మహిళలందరూ చదువుకోవాలని అన్నారు. ఖాజీపేట మండలంలో 1050 మందిని అక్షరాస్యులుగా మార్చాలన్నారు. చదువు లేని వారిని గుర్తించి వారికి దగ్గరగా ఉన్న అంగన్ వాడీ కేంద్రంలో విద్య అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి మహిళ చదువు కటుంబ అభివృద్ధికి పునాది లాంటిదని సూచించారు. ఈకార్యక్రమంలో ఏపీఎం శైలజ తోపాటు వెలుగు సిబ్బంది డ్వాక్రా సభ్యులు పాల్గొన్నారు.

మైదుకూరు: విద్యార్థులు గట్టి సంకల్పంతో చదివితే ఉన్నత స్థానం చేరుకుంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఓబుళమ్మ, ప్రశాంతి అన్నారు. మండలంలోని వనిపెంట జ్యోతిరావు పులె గురుకుల బాలికల పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ శారీరక, మానసిక ఎదుగుదలకు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇందిర, జయలక్ష్మి గుడ్ విజయకుమారి, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఏఎస్ఐ ఇంట్లో దొంగలు పడ్డారు

- 9 తులాల బంగారు, పట్టాదారు పాస్‌బుక్ చోరీ
- డాగ్ స్క్వాడ్ పసిగట్టకుండా సంఘటన స్థలంలో కారంపొడి చల్లిన దుండగలు



దొంగలు పగలగొట్టిన బీరువాను పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐలు

ప్రొద్దుటూరు క్రైం: ఆర్టీసీ ఏఎస్ఐ ఇంటికే దొంగలు కన్నం వేశారు. ఇంట్లో ఎవరూ లేరని పసిగట్టిన దొంగలు తలుపులను పగులకొట్టి చోరీకి పాల్పడ్డారు. బీరువాలోని బంగారు నగలతో పాటు పట్టాదారు పాస్‌బుక్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రొద్దుటూరు మండలంలోని నంగనూరుపల్లెకు చెందిన బైరగాని మునెయ్య మూడేళ్లుగా ప్రొద్దుటూరు ఆర్టీసీ డిపోలో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆయన ఇద్దరు కుమారులు నరేంద్రకుమార్, నాగసుదర్శన్‌లు బెంగళూరులో ఉంటున్నారు. కుమారులు, మనువళ్లను చూసేందుకు మునెయ్య, ఆయన భార్య గంగమ్మ శనివారం రాత్రి బెంగళూరుకు వెళ్లారు. అక్కడ పనులు ముగించుకొని తిరిగి మంగళవారం వేకువ జామున 4.45 సమయంలో దంపతులిద్దరూ నంగనూరుపల్లెకు వచ్చారు. తూర్పు వైపున ఉన్న ఇంటి తలుపులు పగులగొట్టి ఉండటంతో దంపతులిద్దరూ కంగారుగా ఇంట్లోకి వెళ్లారు. రెండు బెడ్ రూముల్లోని బీరువాలు పగులకొట్టబడి అందులో ఉన్న వస్తువులన్నీ చెల్లా చెదురుగా పడి ఉన్నాయి. బీరువాలను పరిశీలించగా బంగారు నగలు, పట్టాదారు పాస్‌పుస్తకం కనిపించలేదు.

సంఘటన స్థలంలో పోలీసుల పరిశీలన

సమాచారం తెలుసుకున్న రూరల్ సీఐ బాలమద్దిలేటి, ఎస్ఐ మహమ్మద్‌రఫీలు గ్రామంలోని సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఆధారాలు దొరక్కూడదని ఇంటి పరిసరాలు, ఇంట్లోను దుండగులు కారం పొడి చల్లారు. పట్టాదారు పాస్‌పుస్తకం చోరీ కావడంపై పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గిట్టనివారు చోరీ చేసి ఉంటారని పోలీసు అధికారులు భావిస్తున్నారు. క్లూస్‌టీం బృందం చోరీ జరిగిన ఇంట్లో వేలిముద్రలను సేకరించారు. 9 తులాలు బంగారు ఆభరణాలు, పాస్ పుస్తకం చోరీకి గురైనట్లు మునెయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బాలమద్దిలేటి తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



మందులు పరిశీలిస్తున్న హిమదేవి

బద్వేలు అర్బన్: ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేసే వైద్యులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ (డీసీహెచ్ఎస్) డాక్టర్ హిమదేవి పేర్కొన్నారు. మూడు రోజుల క్రితం ప్రభుత్వాసుపత్రిలో కాలం చెల్లిన సిరప్ ఇవ్వడంతో బాలుడు అస్వస్థతకు గురైన నేపథ్యంలో మంగళవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలోని ఔషధ శాలను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రిలో బాలుడికి ఇచ్చిన కాలం చెల్లిన సిరప్ బ్యాచ్ నెంబర్ 081గా గుర్తించామని, దీనిని 2022వ సంవత్సరం అక్టోబర్ నెల 7వ తేదీన ఏపీఎంఎస్ఐడీసీ నుంచి దాదాపు 2 వేల సిరప్‌లు తెప్పించామన్నారు. తర్వాత 2023 జూలై 12వ తేదీ నాటికి ఔషధ శాలలకు పంపించామని, అవి అయిపోయిన తర్వాత మళ్లీ రెండు సార్లు దాదాపు 5500 సిరప్‌లు వచ్చాయని తెలిపారు. ప్రస్తుతం ఆసుపత్రిలో నిలిచి ఉన్న సిరప్‌ల బ్యాచ్ నెంబర్ 0776 ఉందని, వాటి కాలపరిమితి 2025 జూన్ వరకు ఉందని తెలిపారు. అయితే బాలుడికి ఇచ్చిన 081 బ్యాచ్ నెంబర్ సిరప్ ఏ విధంగా ఔషధశాలకు వచ్చిందో విచారణ జరుపుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బారెడ్డి, ఇతర వైద్యులు, పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య



లక్ష్మీనరసమ్మ

బద్వేలు అర్బన్ : లక్ష్మీపాలెం గ్రామంలో మంగళవారం ఓ వివాహిత ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని బాలాయపల్లెకు చెందిన మజ్జారి లక్ష్మీ నరసమ్మ(30)కు పదేళ్ల క్రితం లక్ష్మీపాలెం గ్రామానికి చెందిన సుబ్బరాయుడుతో వివాహమైంది. సుబ్బరాయుడు టైలర్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. అయితే లక్ష్మీనరసమ్మ మానసిక సమస్యలతో బాధపడుతూ చికిత్స చేయించుకునేది. మంగళవారం ఉదయం భర్త దుకాణానికి వెళ్లగా పిల్లలు బడికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్ కొక్కీకి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. చుట్టుపక్కల వారు గమనించి లక్ష్మీనరసమ్మను కిందికి దించి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలి తండ్రి కొండయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అర్బన్ ఎస్ఐ రవికుమార్ కేసు నమోదు చేశారు.

భూ సమస్యల పరిష్కారానికి కమిటీలు



మాట్లాడుతున్న ఆర్డీఓ చంద్రమోహన్

కాశినాయన: మండలంలో భూ సమస్యలను పరిష్కరిస్తామని బద్వేల్ ఆర్డీఓ చంద్రమోహన్ తెలిపారు. మండల తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని అక్కెంగుండ్ల, ఇటుగుల్లపాడు, సావిశెట్టిపల్లె రెవెన్యూ గ్రామాల్లో ఎక్కువగా భూ సమస్యలున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. త్వరలో అక్కెంగుండ్ల గ్రామానికి గోపవరం తహసీల్దారు త్రిభువన్‌రెడ్డి, ఇటుగుల్లపాడు రెవెన్యూ గ్రామానికి మైదుకూరు తహసీల్దారు నరేంద్ర, సావిశెట్టిపల్లె రెవెన్యూ గ్రామానికి పోరుమామిళ్ల తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డిలను నియమించి భూ సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విజిలెన్స్ కమిటీ ఏర్పాటు చేయాలి

బద్వేలు అర్బన్: దళితుల సమస్యలు త్వరితగతిన పరిష్కారమయ్యేందుకు ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటుచేయాలని దళిత ప్రజా సంఘాల నాయకులు మంగళవారం ఆర్డీఓ చంద్రమోహన్‌కు వినతిపత్రం సమర్పించారు. దళిత గిరిజన జేఏసీ కన్వీనర్ ఎం.పిచ్చయ్య, సీనియర్ దళిత నాయకులు జి.కేశవయ్య మాట్లాడుతూ బద్వేల్ నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ లేకపోవడంతో దళితుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తాం



సమస్యలపై కార్మికులతో చర్చిస్తున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

ప్రొద్దుటూరు: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జున తెలిపారు. కమిషనర్ ఛాంబర్‌లో మంగళవారం సాయంత్రం జరిగిన సమావేశంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) పట్టణ కమిటీ నాయకులు మాట్లాడుతూ ఆప్కాస్ కార్మికులకు సమ్మెలో పెండింగ్‌లో ఉన్న హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని, కార్మికులందరికీ సకాలంలో నాణ్యమైన పనిముట్లు ఇవ్వాలని కోరారు. చనిపోయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను ఉద్యోగంలోకి తీసుకున్నారని, వారికి 8 నెలల నుంచి జీతాలు ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో చంటి, సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు

చాపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొనే ప్రతి విద్యార్థికి కంటి వైద్య పరీక్షలు చేస్తామని నేత్ర వైద్యులు కేజే రఘురామిరెడ్డి అన్నారు. చాపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రఘురామిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు కంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు పరీక్షలు చేస్తున్నామన్నారు. అనంతరం 300 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, 16 మందికి కంటి అద్దాలు అవసరమైనట్లు గుర్తించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌస్‌మొహిద్దీన్, లీల, స్రవంతి, వెంకటసుబ్బమ్మ పాల్గొన్నారు.